విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999




# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 103 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi ఆదివారం 26 ఏప్రిల్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'

### ఎకనమిక్ టైమ్స్ అవార్డు అందచేత




**అమరావతి,ఏప్రిల్25 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబై వేదికగా ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. ప్రముఖ దినపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' సీఎం దార్శనికతకు, పాలనా సంస్కరణలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన, సులభతర వాణిజ్యంలో

మిగతా 2వ పేజీలో..

## అస్వస్థకు గురైన గవర్నర్ నజీర్

### మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షలు..డిశ్చార్జ్

### విషయం తెలిసి లోక్‌భవన్‌కు వెళ్లి బాబు పరామర్శ



**విజయవాడ,ఏప్రిల్25 (చట్టంన్యూస్) :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అస్వస్థతకు గురయ్యారు. కడుపులో తీవ్ర నొప్పి రావడంతో ఆయనను విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్.. బెంగళూరు నుంచి విజయవాడకు రావాల్సి ఉండగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఆలస్యమైంది. రాత్రి 12 గంటలకు చేరుకోవాల్సిన విమానం ఆలస్యంగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో విజయవాడకు చేరుకుంది. అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో తెల్లవారుఝామున సుమారు 4:30 గంటలకు

మిగతా 2వ పేజీలో..

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

### ఈగిల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు — ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

**అమరావతి,ఏప్రిల్25 (చట్టంన్యూస్) :** డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు అతి త్వరలో ఈగల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. శనివారం మంగళగిరిలో ఈగల్ హెడ్ క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం ఈగల్ వింగ్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. పని తీరుతో ఈగల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈగల్‌ను ప్రీమియర్ ఆర్గనైజేషన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గంజాయి పెంపకం, ఉత్పత్తిను నిరోధించేందుకు.. అలాగే ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) అమలు చేయడంలో ఈగల్ ముందుందని వివరించారు. గతంలో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ తరహాలోనే ఈగల్ కూడా బాగా రాణిస్తుందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో చేయగలిగారని చెప్పారు. భవిష్యత్తులో ఈగల్ టీం మరింత యాక్టివ్‌గా పని చేస్తుందని పేర్కొన్నారు. డ్రోన్లు, శాటిలైట్లతో గంజాయి నిర్మూలన చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ వినియోగించే వారిపై ఫోకస్ పెడుతున్నామని ఏపీ

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ

- కవిత సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం
- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేదన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత



**హైదరాబాద్,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ

మిగతా 2వ పేజీలో..

## ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు

- పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు
- అనకాపల్లి పరిశ్రమలకు ఇదే ఆధారం
- మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

**కాకినాడ,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు. అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్‌ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జూన్ నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు, ఏజెన్సీలను మంత్రి సున్నితంగా హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలు కీలకమన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించడానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా

మిగతా 2వ పేజీలో..

# ఎపిలో పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్

- బారులు తీరిన వాహనదారులు
- పెట్రోల్, జీజిల్ కోసం అగచాట్లు
- తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశం
- పెట్రో డీలర్లతో మాట్లాడిన అధికారులు



**అమరావతి,ఏప్రిల్25 (చట్టంన్యూస్) :** ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో అనేక పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో ఇంధనం కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని సమాచారం. పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అయిపోవడంతో వాహనదారులు బంకుల వద్ద నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల బంక్ సిబ్బందితో వాహనదారుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా ఆయిల్ కంపెనీలు అప్పు ప్రతిపాదికన ఇంధన సరఫరాను నిలిపివేయడమేనని తెలుస్తోంది. పెండింగ్ బకాయిలు చెల్లించిన తర్వాతే సరఫరా పునరుద్ధరిస్తామని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేసినట్లు సమాచారం. పాత బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఈ సంక్షోభం ఏర్పడిందని తెలుస్తోంది. ఇక నష్టాలు, పరిశ్రమల్లో వినియోగం తగ్గుదల కూడా సరఫరాపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ సమీపంలో భారీ సంఖ్యలో ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద వందల సంఖ్యలో ట్యాంకర్లు స్టాండ్‌స్టిల్‌లో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కూడా సరఫరా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన సంక్షోభంపై నిన్న విజయవాడలో సివిల్ సప్లైస్ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, ఏపీ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. చర్చలు సఫలమయ్యాయని, నిరంతర సరఫరా కొనసాగుతుందని ఆయిల్ కంపెనీలు తెలిపినట్లు డీలర్స్ అసోసియేషన్ పేర్కొంది. అయితే సమావేశం తర్వాత కూడా పలు బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. సమస్యను వెంటనే పరిష్కరించి సాధారణ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పలు పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ కోసం వినియోగదారులు, రైతులు, వాహనదారులు టిన్నులతో

మిగతా 2వ పేజీలో..

## ఎంతయినా ఒరిజినల్ .. ఒరిజినలే

- కవిత పార్టీపై బిఆర్ఎస్ సెటైర్లు
- అసలు ఒరిజినలే లేదుగా అంటూ టిఆర్ఎస్ ప్రతిదాడి




**హైదరాబాద్,ఏప్రిల్25(చట్టం న్యూస్) :** కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్

మిగతా 2వ పేజీలో..

## హైకోర్టు సిజెగా జస్టిస్ లీసా గిల్

### లోక్‌భవన్లోఓ ప్రమాణం చేయించిన గవర్నర్

### అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్..

మిగతా 2వ పేజీలో..

## మమత, మోడీ..ఇద్దరూ ఇద్దరే

- ఆమె బెంగాల్‌ను..ఆయన దేశాన్ని నాశనం చేస్తున్నారు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్



**కోల్‌కతా,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం

మిగతా 2వ పేజీలో..

## యూజ్ అండ్ కిల్ ..జగన్ విధానం

- జగన్ కనుసన్నల్లోనే దస్తగిరి హత్య
- ఎక్కడికైనా దండయాత్ర చేసే జగన్..
- దస్తగరి కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలే
- ఏపీ రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శ



**అమరావతి,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** 'యూజ్ అండ్ కిల్'.. ఇదే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ పొలిటికల్ పిక్చర్ అని ఏపీ రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. అధికారం కోల్పోయి

మిగతా 2వ పేజీలో..

## జగనన్న లే ఔట్ పేరుతో భారీ అవినీతి

- నివాస యోగ్యం కాని భూములు కొని నొక్కేశారు
- కర్రగ్రహారం లే ఔట్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు



**మచిలీపట్నం,ఏప్రిల్25 (చట్టం న్యూస్):** వైసీపీ హయాంలో జగనన్న లే అవుట్ పేరుతో భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. నివాస యోగ్యం లేని, సముద్ర తీర భూములను కొనుగోలు చేసి పెద్దఎత్తున కమీషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో నివాస యోగ్యం లేని స్థలాలను పేదలకు కేటాయించారని.. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహించారు. వైసీపీ హయాంలో మచిలీపట్నంలోని కరగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. 300 ఎకరాల్లో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి 16వేల ఇళ్ల స్థలాలు కేటాయించింది. కనీస సౌకర్యాలు లేకపోవటంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్దిదారులు ముందుకు రావడం లేదన్నారు. శనివారం ఆ కాలనీలో పర్యటించి వసతులు, సౌకర్యాలను మంత్రి కొల్లు

మిగతా 2వ పేజీలో..

## చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'

**మొదటి పేజీ తరువాయి..**



చంద్రబాబు చూపుతున్న చొరవను కొనియాడుతూ ఎకనమిక్ టైమ్స్ ఈ అవార్డును అందించింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో ఏపీని కీలక భాగస్వామిగా మలిచినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం, పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ప్రజా రాజధాని అని సీఎం అభివర్ణించారు. మరోసారి అమరావతిని నిర్మించే అవకాశం తనకు దక్కడం తన అదృష్టమని సీఎం వ్యాఖ్యానించారు. నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఒక ప్రపంచ స్థాయి ఐకాన్‌గా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు లభిస్తోందని వెల్లడించారు. పేదరికం నిర్మూలన కోసం పి-4 విధానాన్ని తీసుకువచ్చామని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి పేదల అభ్యున్నతికి కృషి చేయడమే ఈ పి-4 లక్ష్యమని వ్యాఖ్యానించారు. సంపదను సృష్టించి, ఆ సంపదను తిరిగి పేదల సంక్షేమానికి మళ్లించేలా ఈ విధానం ఉండబోతుందని సీఎం వివరించారు. ముంబై పర్యటనలో చంద్రబాబుకు లభించిన ఈ గౌరవం ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణకు మరింత బలాన్ని చేకూర్చనుందని అధికారులు తెలిపారు. అమరావతిపై సీఎం వ్యక్తం చేసిన విశ్వాసం ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.

## ఎంతయినా ఒరిజినల్ .. ఒరిజినలే

**మొదటి పేజీ తరువాయి..**

ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు. అంతేగాదు ఆయన ఫామ్‌హౌజ్నుంచి రారు అని కూడా కెసిఆర్‌పై సెటైలర్లు గుప్పించారు.

## మమత, మోడీ..ఇద్దరూ ఇద్దరే

**మొదటి పేజీ తరువాయి..**

వ్యక్తం చేశారు. ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ.. దేశ సంపదను ధనికులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తన చర్యలతో మమత బెంగాల్‌ను నాశనం చేస్తే.. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది ఎన్నికల పోరాటం కాదని.. సిద్ధాంతాల పోరాటమని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఐక్యత-సౌభ్రాతృత్వం..మరోవైపు భాజపా-ఆర్ఎస్ఎస్‌ల ద్వేషం-హింస మధ్య పోరాటం జరుగుతోందన్నారు. హుగ్లీ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భక్తుడిని అని చెప్పుకుంటూ ప్రధాని మోదీ దేశాన్ని అమ్ముకుంటు న్నారని రాహుల్ మండిపడ్డారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో ద్వేషాన్ని, భయాన్ని వ్యాపింప జేస్తారన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అన్ని రాష్ట్రాలు లోబడి ఉండాలని భాజపా యత్నిస్తోందన్నారు. ఆ పార్టీ పేదల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. ధనికుల లబ్ది కోసమే పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో సామాన్యుల పురోభివృద్ధి కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి అస్తవ్యస్తం చేస్తోందన్నారు.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి..**

డీజీపీ తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నా మన్నారు. డ్రగ్స్, గంజాయిని ఎవరు వినియోగిస్తున్నారు? ఎందుకు వినియోగిస్తున్నారనే కోణంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మొదటి దశలో 10 వేల టెస్టింగ్ కిట్స్ వినియోగించామన్నారు. అలాగే డ్రగ్స్ వినియోగించే వారు.. పేమెంట్స్ ఎలా చేస్తున్నారు? ఎక్కడ నుంచి వాటిని తీసుకు వస్తున్నారు? అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా ఈగల్ చర్యలు చేపడుతుందని చెప్పారు. ఇంటర్ స్టేట్ డ్రగ్ నెట్ వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 13 కొత్త ఎన్‌డీపీఎస్ కోర్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు వేల డ్రగ్స్ కేసులు ఉన్నాయని.. అవి ట్రయిల్‌లో ఉన్నాయని గణాంకాలతో సహా డీజీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఐ.జి రవికృష్ణతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైకోర్టు సిజెగా జస్టిస్ లీసా గిల్

**మొదటి పేజీ తరువాయి..**

ఆమెతో ప్రమాణం చేయించారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడ కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య, ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదుచేసుకొని పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, రాజ్యాంగపరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. సుదీర్ఘకాలం చండీగఢ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇదిలావుంటే లీసాగిల్‌కు సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. తొలి మహిళా చీఫ్ జడ్జిగా ఎపికి రావడం గర్వకారణమని అన్నారు.

## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,ఏప్రిల్25 : గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

## ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా

### గన్‌పార్క్ వద్ద అమరులకు కవిత నివాళి



**హైదరాబాద్,ఏప్రిల్25 :** చ్చితంగా ముఖ్యమంత్రి అయ్యి తీరుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో కొత్త విప్లవం మొదలైందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇవాళ పార్టీ ఆవిర్భావం సందర్భంగా.. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేశారు. ఆవిర్భావ సభకు ర్యాలీగా వెళ్తున్న కవితను మీడియా ప్రశ్నించగా.. ఈ మేరకు సమాధానమిచ్చారు. అంతకుముందు ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత.. తన భర్త, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గన్‌పార్కు వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి మునీరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరారు.

# తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ

**మొదటి పేజీ తరువాయి..**



తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది.

మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు.

తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

## యూజ్ అండ్ కిల్ ..జగన్ విధానం

**మొదటి పేజీ తరువాయి..**

రెండేళ్లు గడుస్తున్నా జగన్ పార్టీ పద్ధతి మార్చుకోలేదని విమర్శించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా 'దండయాత్ర' చేసే జగన్.. తన సొంత జిల్లాలో తన ముఖ్య అనుచరుడు హత్యకు గురైతే కనీసం పరామర్శించేందుకు ఎందుకు వెళ్లలేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిలదీశారు. ఇది ఆయన రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కమాండ్ కంట్రోల్ నడుపుతూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కడపలో ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య వెనుక జగన్ ఉన్నారని, ఆయన కనుసన్నల్లోనే ఈ ఘాతుకం జరిగిందని మంత్రి మండిపల్లి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్య అనుచరుడైన దస్తగిరిని భూ లావాదేవీల గొడవల్లో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఠాలే హతమార్చాయని ఆరోపించారు. హత్య తర్వాత దస్తగిరి ఇంట్లో పోలీసులు జరిపిన తనిఖీల్లో వందల కోట్ల విలువైన ఆస్తుల డాక్యుమెంట్లు లభించాయని, వాటిలో రవీంద్రనాథ్ రెడ్డి, ఆయన భార్య, కుమారుడి పేర్లు ఉండటమే వైఎస్ఆర్ కాంగ్రెస్ ముఠాల భూదాహానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో బాబాయి వివేకానంద రెడ్డిని దారుణంగా హత్య చేసి, ఆ నిందను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై నెట్టి 'నారాసుర రక్త చరిత్ర' అంటూ విష ప్రచారం చేసినట్టే.. ఇప్పుడు దస్తగిరి హత్యను కూడా కూటమి ప్రభుత్వంపైకి నెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. డ్రైవర్‌ను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు వంటి నేరస్థులను ప్రోత్సహించడం జగన్ నైజమని మండిపల్లి విమర్శించారు. వైసీపీకి నిజంగా చిత్తశుద్ధి, నైతికత ఉంటే తక్షణమే అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు అక్రమంగా సంపాదించి భూకబ్జాలు చేసి కట్టుకున్న ప్యాలెస్‌లు, వారి దౌర్జన్యాలపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టంచేశారు.

భూములు, ఆస్తులు కోల్పోయిన బాధితులందరికీ న్యాయం చేసి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

రాయలసీమలో నేర సామ్రాజ్యాలు స్థాపించడం జగన్‌కే చెల్లిందని, అందుకే అక్కడి ప్రజలు వైసీపీని భూస్థాపితం చేశారని మంత్రి అన్నారు. వైసీపీ అరాచక రాజకీయాలను, కుట్రలను రాష్ట్ర ప్రజలు ఇకపై నమ్మే పరిస్థితి లేదని చెప్పారు.

-----------------

# ఎపిలో పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్

**మొదటి పేజీ తరువాయి..**

బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వరి కోత యంత్రాల సహాయంతో పంట మాసూళ్లలో నిమగ్నమై ఉన్నారు. అయితే కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ బంకుల్లో అందుబాటులో లేకపోవడంతో కోత పనులు అంతరాయం కలుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఎలాగైనా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో డీజిల్ కొరత మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేసిన రైతులు వరి కోత కోసం యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఇప్పుడు వాటికి ఇంధనం దొరకకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పెట్రో కొరతపై సిఎం అత్యవసర సమీక్ష

అమరావతి,ఏప్రిల్25 : రాష్ట్రంలో ఇంధన కొరతతో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేత అంశంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, వాహనదారులు, రైతుల ఇబ్బందులపై అధికారులతో సీఎం మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం ఆదేశాలతో వెంటనే స్పందించిన అధికారులు.. ఇంధన సరఫరాపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. తక్షణం స్టాక్ లేని బంకుల వివరాలు అందించాలని అధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాల అధ్యక్షులకు రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ సమాచారం పంపించింది. స్టాక్ సమస్య ఉంటే తక్షణం టోల్‌ఫ్రీ నం.1967కు కాల్ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సూచించారు. టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గత ఏప్రిల్ కంటే పదిశాతం అదనపు సరఫరాకు ఆయిల్ కంపెనీలు అంగీకారం తెలిపాయి. పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్‌పీటీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ వివరాలు సేకరిస్తున్నారు. ఆయిల్ కంపెనీల సరఫరా తీరుపై క్షేత్రస్థాయి నివేదిక సమర్పణకు చర్యలు చేపట్టారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు.

## ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు

**మొదటి పేజీ తరువాయి..**

ఈ నీటిని అందిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ గత ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు నాడు జగన్ గండికొట్టారని మంత్రి నిమ్మల ఆగ్రహించారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తే, రెండో ప్రాధాన్యతగా లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవలోని 472 కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.30.38 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. పోలవరం ఎడమ కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. పాయకారావుపేటకి ఎగువన ఉన్న 98 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## అస్వస్థకు గురైన గవర్నర్ నజీర్

**మొదటి పేజీ తరువాయి..**

గవర్నర్‌కు కడుపులో నొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వైద్య పరీక్షల అనంతరం మాణిపాల్ ఆసుపత్రి నుంచి తన నివాసానికి చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్.. జర్నీ ప్రభావం, అర్ధరాత్రి ఆలస్యం కావడం లాంటి చిన్న కారణాల వలన అస్వస్థతకు గురైనట్టుగా తెలుస్తోంది.. అయితే కిడ్నీలో రాళ్లు ఉన్నాయని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. గవర్నర్ వైద్య పరీక్షల్లో కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు.. శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించాలని సూచించారు. ఇవాళ ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని చెప్పిన గవర్నర్.. మరోసారి ఆసుపత్రికి వస్తానని చెప్పి వెళ్లిపోయారు.విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్ భవన్‌కు వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన విషయం తెలిసి, లోక్ భవన్‌కు చేరుకున్న సీఎం.. గవర్నర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## జగనన్న లే ఔట్ పేరుతో భారీ అవినీతి

**మొదటి పేజీ తరువాయి..**

రవీంద్ర పరిశీలించారు. సెంటు స్థలంలో నిర్మించిన ఇళ్లకు వెళ్లి లబ్దిదారులతో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కనీస వసతులు లేవని మంత్రి వద్ద లబ్దిదారులు వాపోయారు. చౌడు భూములు కావడంతో పెద్ద మొత్తంలో నిర్మాణ వ్యయమైందని లబ్దిదారులు తెలిపారు. ఈ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్మాణాల కోసం ముందుకు రాకపోతే ఆ స్థలాలను వెంటనే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జగన్ హయాంలో ఈ కాలనీని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్దిదారులు ముందుకు రాలేదని మంత్రి చెప్పుకొచ్చారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కాలనీలో కనీస వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ కాలనీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## సిఎం రేవంత్‌తో పోలీస్ అధికారుల భేటీ

హైదరాబాద్,ఏప్రిల్25 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఐసీసీసీలో సీనియర్ పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. డీజీపీ ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ భాగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ లు కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వీరికి డిజిలుగా ప్రమోషన్లు ఇచ్చింది. దీంతో వీరు సిఎం కలిసారు.



# గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ

- మన మనిషి కాదు...మర మనిషిగా మారిన కెసిఆర్
- గుంటనక్కలు, తోడేళ్ల మధ్య బందీగా కెసిఆర్
- బిఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది
- టిఆర్ఎస్ అధినేత్రి కవిత విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్25 :** గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్ అని కల్వకుంట్ల కవిత అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో మర్చిపోలేని రోజుగా అభివర్ణించారు. 'నేను అమ్మవారి భక్తురాలిని. నాకు సింగరేణి చాలా ఇష్టం. మీకంటే ఆడబిడ్డలంటే మరింత ఇష్టం. రాష్ట్రంలో అంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా తెలంగాణ జాగృతి ఎంతో కీలకంగా పనిచేసింది. బతుకమ్మ పాట వచ్చాక మన సంస్కృతికి ఊపిరి వచ్చింది. ఏమేమి కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో ఆ కలలో నిజం కాలేదు. కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదు. బానిస సంకెళ్లు తెగుతాయనుకుంటే రైతులకు బేడీలు ఉద్యమకారులకు కేసులు వచ్చాయి. ఆనాడు పాలించిన కుటుంబంలో నేను ఒకదాన్ని. నాడు జరిగిన తప్పులకు క్షమించమని కోరుతున్నా. తెలంగాణ ప్రజల కలల సాకారం కోసం తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావించింది. రేపటి నుంచి చూస్తారు మా పని ఎలా ఉంటుందో మా పోరాటం ఎలా ఉంటుందో.' అని కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఆ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్నారు. అమ్మతనంతో పాలన సాగిస్తే ప్రజల కష్టాలు తెలుస్తాయని.. అనేకమంది తెలంగాణ రాష్ట్ర వచ్చిందన్నారు. నీళ్ల కోసం ఒక లక్ష ఇరవై ఒక్క వేల కోట్లు ఖర్చు పెట్టిందని.. 14 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చిందన్నారు. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరన్నారు. ఇప్పుడు కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి అన్నారు. 'ఆ సారు రారు.. గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు ఏమి తెలియదు కాబట్టి మాట్లాడరు అనుకుందాం. కానీ కేసీఆర్ ఎందుకు మాట్లాడట్లేదు. ఆనాడు టీఆర్ఎస్ కోసం, కేసీఆర్ కోసం కొట్లాడిన వాళ్లకు ఏమి దక్కింది? ఇది మన కేసీఆర్ కాదు.. నేను కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పాను. నన్ను బయటకు పంపి.. పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం. రెండేళ్ల తర్వాత మనమే అధికార పక్షం అవుతాం' అని కవిత వ్యాఖ్యానించారు.

## టిఆర్ఎస్ ఆవిర్భావంతో బిఆర్ఎస్‌కు షాక్

### తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన

హైదరాబాద్,ఏప్రిల్25 : తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.

## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

### తెలంగాణలో వచ్చిదే బిజపియే

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

హైదరాబాద్,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ): కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.

## మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

### రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు

### ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా

కోల్‌కతా,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ):ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్టాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడని అమిత్ షా హామీనిచ్చారు.

# సంస్కరణలకు ముందు.. తరవాత దేశాన్ని అధ్యయనం చేశా

- సంస్కరణలకు అనుగుణంగానే విజన్-2020 అమలు
- టెక్నాలజీని అందుపుచ్చుకోవడంతోనే ఫలితాలు
- పేదరికం నుంచి బయటపడేసేందుకు పీ4 తీసుకొచ్చాం
- ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్
- టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ అవార్డు అందుకోవడం ఆనందం
- దీంతో ఎపికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం
- ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ అవార్డు కార్యక్రమంలో చంద్రబాబు



ముంబై,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ): ఆర్థిక సంస్కరణలకు ముందు.. తర్వాత దేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశానని, సంస్కరణలకు అనుగుణంగానే విజన్ 2020 అమలు చేశామని ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు హైదరాబాద్ చూస్తున్న అభివృద్ధి ఫలాలు అవేనని అన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. ప్రముఖ మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ అందించే ప్రతిష్ఠాత్మక ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'పేదరికం నుంచి బయటపడేసేందుకు పీ4 తీసుకొచ్చాం. ఈ పథకం ఓ గేమ్ ఛేంజర్. లక్షమంది మార్గదర్శులు.. 10 లక్షల మందిని దత్తత తీసుకున్నారు. సమాజంలో లింగ సమానత్వం, మహిళా సాధికారత చాలా ముఖ్యం. అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థాయి దేశంగా మారుతుందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్ అని ప్రశంసించారు. టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు ద్వారా మరికొన్ని పెట్టుబడులు ఏపీకి వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఏపీలో అనుమతుల వేగాన్ని పారిశ్రామిక వేత్తలు గుర్తించాలని కోరారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. దేశంలో సంస్కరణలు అమలవుతున్నాయని.. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని తెలిపారు. ఇది పెట్టుబడులకు కూడా మెరుగైన సమయమని చెప్పుకొచ్చారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమి లాంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రప్రభుత్వ నిర్ణయం సరైనదేనని వ్యాఖ్యానించారు. లింగ సమానత్వం, మహిళలకు సమాన అవకాశం కల్పించేందుకు తీసుకువచ్చిన బిల్లు ఇదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో నారీ శక్తి బిల్లును ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాయో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని ప్రస్తావించారు. నారీ శక్తి బిల్లు అమలైతే మహిళలకు, పురుషులకు ఎక్కువ అవకాశాలు దక్కి ఉండేవని తెలిపారు. ఈ బిల్లు అమలు చేయకపోవడంతో మహిళలు అవకాశాలు కోల్పోయారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేశంలోని మహిళలంతా గట్టిగా సంకల్పిస్తే ఈ బిల్లు ఎలాగైనా అమలు అవుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తేనే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రగతిశీల ఆలోచనలు ఉన్న నాయకుడని అభివర్ణించారు. నిబంధనలను సరళీకృతం చేస్తూ పెట్టుబడులను మోదీ ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. పెట్టుబడులకు ప్రోత్సాహం అందిస్తేనే సంపద సృష్టి జరుగుతుందని వెల్లడించారు. మూడు దశాబ్దాల క్రితం జనాభా నియంత్రణను గట్టిగా అమలు చేశామని వివరించారు. ఇప్పుడు జనాభా కొరతను ఎదుర్కొంటున్నామని సీఎం వ్యాఖ్యానించారు. అందుకే ఈ జనాభా నిర్వహణ ప్రక్రియను చేపట్టాలనే పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ రూపొందించామని స్పష్టం చేశారు. డబ్బులు ఉంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు పెట్టవచ్చని. కానీ భవిష్యత్తులో జనాభాను సాధించలేమని చెప్పుకొచ్చారు. భారత ఫెర్టిలిటీ రేటు 1.9 శాతం ఉందని.. ఏపీలో అది 1.5 శాతం మాత్రమే ఉందని.. అందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. భవిష్యత్తులో జనాభా ఉన్న దేశాలే అత్యంత సంపన్న దేశాలుగా మారుతాయని వివరించారు. ఈ నేపథ్యంలోనే ఏపీలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని తీసుకువచ్చి అమలు చేయాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అబద్ధాల ప్రచారంలో సజ్జల దిట్ట

- జగన్ హయాంలో రైతులు ఆత్మహత్యలు
- నేడు వ్యవసాయానని పండగచేసి చూపుతున్నాం
- సజ్జల వ్యాఖ్యలపై మండిపడ్డ అచ్చన్నాయుడు

అమరావతి,ఏప్రిల్25 :అబద్ధాలు ప్రచారం చేయడంలో వైసిఇ నేత సజ్జలకు ఉన్న ప్రావీణ్యం దేశంలో ఎవరికీ లేదని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అచ్చెన్నాయుడు ట్వీట్ పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో అప్పుల భారంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోందని వ్యాఖ్యానించారు. తమ గణాంకాలు ప్రస్తావించామని.. దమ్ముంటే సమాధానం చెప్పాలని సజ్జలకు సవాల్ చేశారు. వైసీపీ వైఫల్యం వల్ల 2023-24లో 143 లక్షల మెట్రిక్ టన్నులకు ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయిందని అచ్చెన్నాయుడు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 237 లక్షల టన్నులకు పెంచి 51శాతం వృద్ధిని నమోదు చేసిందని ప్రస్తావించారు. ధరల స్థిరీకరణ నిధి కింద కేటాయింపులు పెంచి, సుమారు రూ.588 కోట్లతో పొగాకు, మామిడి, ఉల్లి, కోకో రైతులకు నేరుగా లబ్ది చేకూర్చామని వివరించారు. ఉల్లి రైతులకు గతంలో ఉన్న రూ.25 వేల నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.50 వేలకు పెంచి ఆదుకున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మొక్కజొన్న సమస్యపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నిరంతరం చర్చిస్తూ రైతులకు అనుకూల నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్‌లో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టామని చెప్పారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రూ.881 కోట్ల డ్రిప్, స్ప్రింక్లర్ బకాయిలను కూడా తామే చెల్లించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. ఆయిల్ పామ్ సాగులో ఏపీని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి, ఉ÷ఎంను రూ.1.52 లక్షల కోట్లకు చేర్చామని వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఇంకా అబద్దాలతో రైతులను మోసం చేయాలని చూస్తే ప్రజలే వైసీపీ నేతలకు తగిన బుద్ధి చెబుతారని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## తండ్రి పిట్టల దొర..బిడ్డ పిట్టల దొరసాని


### కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి

### మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపి అర్వింద్

హైదరాబాద్,ఏప్రిల్25 : సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

## తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఏప్రిల్25 : హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉండి.. పూర్తిగా కార్బన్-÷బైర్ బాడీ రాకెట్. కార్బన్ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

## ల్యాండ్ పూలింగ్ రైతులకు శుభవార్త

### మే1నుంచి రైతులకు కౌలు నిధులు జమ

### మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి,ఏప్రిల్25 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు ఏపీ మంత్రి నారాయణ శుభవార్త తెలిపారు. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు మే 1వ తేదీ నుంచి కౌలు నిధులు జమ చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతున్న తీరుపై అధికారులతో మంత్రి నారాయణ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు శ్రవణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్లు భార్గవ తేజ, కార్తీక్, డిప్యూటీ కలెక్టర్లు, ఎమ్మార్వోలు హాజరయ్యారు. ఇంటర్ నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వేలైన్, రైల్వేస్టేషన్ కోసం 7 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఎంజాయ్‌మెంట్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ నిర్వహణ ఏజెన్సీలతో పలు కీలక అంశాలపై మంత్రి నారాయణ చర్చించారు. లెగసీ వ్యర్థాలను త్వరితగతిన పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఫ్రెష్‌వేస్ ఎ÷-లాంట్‌ల ఏర్పాటు త్వరగా పూర్తి చేసి వ్యర్థాల నిర్వహణ ప్రారంభించాలని సూచించారు.

# దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి సవాల్ చేసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**మహబూబ్ నగర్ 24 ఏప్రిల్ 2026( చట్టం న్యూస్) :** టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ కు రాజీనామా చేసి గెలుపొందాలని మాజీ ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కు దేవరకద్ర అభివృద్ధి పైన ధ్యాస లేదు అడ్వకేట్ తెలివి ఉపయోగించి కేసులు ఎలా మలుపు తిప్పలో ఎలా ఎఫ్ఐఆర్ చేయాలో చార్జి సీటు ఎలా దాఖలు చేయాలో పెండింగ్లో ఉన్న కేసులు ఏవిధంగా రీఓపెన్ చేయాలో ఆయనకు బాగా తెలుసు అని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కేసులతో బెదిరించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం ఆయన నైజాం అని అన్నారు.

కార్యకర్తలు ఎన్ని భయభ్రాంతులకు గురిచేసిన ఎవరు భయ పడా రాజీనామా చేసి జిఎంఆర్ గెలిస్తే నేను రాజకీయం నుంచి తప్పుకుంటానని తెలిపారు.

కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుండి గ్రావిటీ కెనాల్ ద్వారా 11 గ్రామాలకు సాగునీరు అందించామని తెలిపారు.

పెద్దవాగు ఊక చెట్టు వాగు మీద మీద 36 చిక్ డ్యాముల నిర్మాణం చేసింది టిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలోనే అని గుర్తుంచుకోవాలన్నారు.

అతి తక్కువ ఖర్చుతో బండర్ పల్లి వద్ద చెక్ డ్యామ్ నేర్పించానన్నారు. దేవరకద్ర పై చిత్తశుద్ధి ఉంటే కరివేన రిజర్వాయర్ పాలమూరు ప్రాజెక్టు పరుల ఆపేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూలు స్థలం మార్చమని అడిగితే తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేశారన్నారు. అతితెలియ ప్రయోగిస్తారని జిఎంఆర్ కు హెచ్చరించారు. కురుమూర్తి స్వామిగా సాక్షిగా చెబుతున్నా తవ్వకాల్లో ఎలాంటి అవినీతి చేయలేదని కేవలం రిజర్వాయర్ కోసమే కొన్ని కోట్ల క్యూబిక్ మీటర్లు మట్టి అవసరం ఉంటుంది కావున చెరువుల్లో మట్టి తీసి రిజర్వార్లకు తరలించడం జరిగిందని వాటికి కూడా కాంట్రాక్టర్లకు డబ్బులు ఇచ్చామని తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఆరోగ్యానికి అమలు చేస్తామని కురుమూర్తి స్వామి దగ్గర బాడ్ పేపర్ రా సంతకం పెట్టినావు ఏమైనాయని ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారు రాబోయే రోజుల్లో సరైన తీర్పిస్తారని ఆయన తెలిపారు.

దేవరకద్ర నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఉపఎన్నికకు సిద్ధమైతే నేను రెడీ నేను ఉపఎన్నికలో ఓడిపోతే రాజకీయంకి స్వస్తి చెప్పి మళ్లీ జీవితంలో పోటీ చేయనని మాజీ ఎమ్మెల్యే సవాలు విసిరారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఈ కేసులలో చూపించిన తెలివిని ద్వారకద్ర అభివృద్ధిపై చూపించాలని ఆయన కోరారు.. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అక్రమ కేసుల జాబితాలో దేవరకద్ర రికార్డు స్థాయిలో ఉందని తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి





- సన్నరకాలు సాగు చేయాలి
- ప్యాడీ క్లీనర్లు వినియోగించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ మెప్మా కొనుగోలు కేంద్రంలో పరిశీలన

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 25,( చట్టం బ్యూరో) :** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు.

టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని ఆరా తీసి.. పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? సన్న రకం వడ్లు వచ్చాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల కేటాయింపు.. ఆన్లైన్లో వివరాల నమోదు పై ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు ప్యాడీ క్లీనర్ల వినియోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కేటాయించిన మిల్లులకు ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలని సూచించారు. పరిశీలనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోట చౌరస్తాలో రోడ్డుపై పారుతున్న మరుగునీరు?


- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు వాహనదారులు.
- డ్రైనేజీ పూడిక తీయని మున్సిపల్ అధికారులు.
- పారిశుద్ధ్య పై చర్యలు తీసుకొని మునిసిపల్ కమిషనర్

**మహబూబ్ నగర్ 25 ఏప్రిల్ 2026 ( చట్టం న్యూస్ ) :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణములో చౌరస్తా నడిబొడ్డున నిత్యము రద్దీగా ఉంటే భీమబాలస్వామి మెడికల్ షాప్ దగ్గర డ్రైనేజీ శుభ్రం చేయకపోవడం వలన పేరుకుపోయిన చెత్తాచెదారం బ్లాక్ కావడంతో మరుగునీరు రోడ్డుపైకి పారుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో శానిటేషన్ అధికారులు మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ లోపం కారణంగానే రోడ్లపై దుర్వాసన వెదజల్లుతూ మరుగునీరు పారుతుంది. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిశుభ్రత కాకుండా పట్టణ అభివృద్ధి పేరుతో లక్షల రూపాయలు నిధుల దుర్వినియోగం చేస్తూ ప్రజల మౌలిక వసతులను ఆరోగ్యం దోమలు పారిశుద్ధ్యపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రమౌళి కిరాణం నుండి బస్టాండ్ వరకు రోడ్డుపై మరుగు ప్రవహిస్తుంది. రోడ్డుపై వెళ్లే పాదాచారులు ముక్కు మూసుకొని దుర్వాసన భరించలేక మరుగు నీటిలో నడిచి వెళ్తున్నారు. వాహనాల రాకపోకలకు రోడ్డుపై వెళ్లే వారిపై పడడంతో తప్పని పరిస్థితిలో వెళ్లాల్సి వస్తుందని వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి పారిశుధ్యం పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం.

**జక్కా మహబూబ్ రెడ్డి మరియు జక్కా ఇంద్రసేన రెడ్డి.**



**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్,ఏప్రిల్ 25 (చట్టం న్యూస్) :** పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల ఆదేశానుసరం చీకటాయపాలెం గ్రామానికి చెందిన వేల్పుగొండ వెంకటమ్మ ఇటీవల మృతి చందగా విషయం తెలుసుకున్న తొర్రుర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మడిపల్లి గ్రామ మాజీ ఎంపిటిసి జక్కా మహబూబ్ రెడ్డి మరియు జక్కా ఇంద్రసేన రెడ్డిలు, వేల్పుగొండ వెంకటమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి బాధితురాలి కుటుంబానికి 3000 నగదును మరియు 25 కేజీల బియ్యాన్ని అందించారు.. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టిపీసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల సహకారంతో అన్ని విధాలుగా ఆధుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు చీకటాయపాలెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిండి వీరన్న, పల్లె దయాకర్, సింగం దామోదర్, నంబర్ ముత్తయ్య, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిన్న వెంకన్న, సాధిక, వార్డు సభ్యులు ,మడిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నం సోమిరెడ్డి,మడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రావుల వెంకట రెడ్డి , మడిపల్లి వార్డు సభ్యులు మహంకాళి సంపత్ వల్లంల వెంకటేశ్వర్లు, వల్లపు రాఘవులు, యర్రం రాజు యాదవ్, నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

**సిడబ్ల్యుసి ఎదుట హాజరు పరిచేందుకు బాలిక తరలింపు ;**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 25,( చట్టం బ్యూరో ) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని శనివారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతోందని రెండు రోజుల క్రితం 1098కు సమాచారం అందడంతో తహసీల్దార్ సుజాత గారు,ఐ . సి.డీ.ఎస్. సిరిసిల్ల సీడీపీఓ ఉమారాణి గారు, సూపర్ వై జర్ వనిత గారు,డీ.సి.పీ.ఓ కవిత గారు చైల్డ్లైన్ కోఆర్డినేటర్ స్రవంతి గారు , పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులను వివరాలు అడిగినా వారు సహకరించకపోగా తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు బాలిక చదివిన పాఠశాల నుంచి రికార్డులు సేకరించగా, 24-08-2009న జన్మించినట్లు ధృవీకరించారు. బాలిక వయస్సు చట్టపరంగా వివాహానికి తక్కువగా ఉండటంతో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి వివాహాన్ని నిలిపివేశారు. ఈ సమయంలో బాలిక బంధువులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్వాడి టీచర్ సమాచారం ఇచ్చిందని ఆరోపిస్తూ ఆమెపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించిన ఘటన కూడా జరిగింది.

అనంతరం బాలికను బాలల సంరక్షణ కమిటీ ఎదుట హాజరు పరిచేందుకు సిరిసిల్లకు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులకు బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, అలాంటి వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

# ఆకుల లక్ష్మి దేవమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత




**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 25,( చట్టం బ్యూరో ) :** బూరుగుపల్లి గ్రామంలోని ఆకుల లక్ష్మి దేవమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబానికి ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూదుల సాయి ,కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీని నిలబెట్టుకుని ఆర్థిక సహాయం అందజేత

**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 25 , (చట్టం బ్యూరో) : బోయిన్** పల్లి మండలం లోని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ ఆధ్వర్యం లో ఎన్నికలలో హామీ ఇచ్చిన విదంగా 5 వేల రూపాయలను ఆర్థిక సహాయం గా గడ్డం వెంకటేశం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో 4 వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్,నాయకులు సూదుల సాయి,తిరుపతి పాల్గొన్నారు.

# ఎన్.బి.ఎం లా కాలేజ్ విద్యార్థుల జయధ్వజం

**- హిమ బిందు, నేఖ్ పర్వీన్‌కు పురస్కారాలు**





(విశాఖపట్నం - ఏప్రిల్ 25) న్యాయ విద్యలో అగ్రగామిగా నిలుస్తున్న ఎన్బీఎం లా కాలేజ్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థిని గుమ్మల హిమ బిందు అన్ని అనుబంధ కళాశాలలలో ఉత్తమ ప్రతిభా విద్యార్థిగా (బెస్ట్ మెడిటోరియస్ స్టూడెంట్) అవార్డు అందుకుంది. అలాగే మరో ఫైనల్ ఇయర్ విద్యార్థిని నేఖ్ పర్వీన్ కళాశాలలో ఉత్తమ చురుకైన ప్రదర్శకురాలిగా (బెస్ట్ యాక్టివ్ పెర్ఫార్మర్) గుర్తింపు పొందింది. ఈ రెండు అవార్డులు కళాశాలకు గర్వకారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా సీతమ్మధారలోని కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘన సత్కార సభ నిర్వహించారు. కళాశాల డీన్ డి.వి.రమణ ,ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గాయత్రి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులను సత్కరించారు. కళాశాల సాధించిన విజయాల్లో విద్యార్థుల కృషి కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ విజయాలతో ఎన్బీఎం లా కాలేజ్ మరోసారి తన ప్రతిష్టను నిలబెట్టుకుంది.

# ఈ -టెండర్ రద్దు చేనేత కార్మికుల విజయం

**కొత్తపల్లి మాజీ ఉపసర్పంచ్, సామాజిక సేవకులు అను మల్ల చంద్రమౌళి**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 25,( చట్టం బ్యూరో) ;** చేనేత కార్మికుల పొట్టకొట్టేలా ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ర్రావీఖ ఈ -టెండర్ నోటిఫికేషన్ ను హైకోర్టు రద్దు చేయడం చేనేత కుటుంబాల విజయమని బీజేపీ జిల్లా నాయకులు, కొత్తపల్లి మాజీ ఉపసర్పంచ్ అను మల్ల చంద్రమౌళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో 17 వేలకు పైగా హ్యాండ్ లుమ్స్ ఉండగా, వాటిపై ఆధారపడి 40 వేల చేనేత కుటుంబాలు పని చేస్తున్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం బడా కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు ప్రత్యేక జీవో ద్వారా ఈ - టెండర్ విధానం తెచ్చి చేనేత కార్మికుల పొట్ట కొట్టాలని చూసిందన్నారు. దీనిపై చేనేత కార్మికులు హైకోర్టును అశ్రయించగా న్యాయం జరిగిందన్నారు. గురుకుల విద్యా సంస్థలు, అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలకు అవసరమయ్యే బెడ్ షీట్లు, కార్పెట్లు, టవల్స్ అన్నీ టెస్కో ద్వారానే తీసుకోవాలనే హైకోర్టు వెంటనే యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని అను మల్ల చంద్రమౌళి ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, వస్త్రాల కొనుగోళ్ళ కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించి, చేనేత కార్మికులకు పని కల్పించాలన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలనీ అను మల్ల చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## "పంచదార తింటూ.. ఉప్పు తినే నా ఆహారం..".



-గురువుకు తగిన గుణాలే, విద్యార్థులకు,అనుసరణీయం,
-ఉప్పు, చప్పదనంలో ఉండే బావిలో కూడా తీపి నీరు ఉండదు,
-చెడు లక్షణాలు సమాజానికి చీడ,ఎదుటివారికి ఇవ్వాలి నీడ,మీగడ చెరుకు గడ..
-పామును కరిచే స్వభావం మనిషికి రాదు, ఎర్ర తేలు మనిషిని కాటు వేయగలదు,
-సముద్రం నిండా మణిమాణిక్యాలు ఉన్నా, మన చేతికి రాళ్లు, ముళ్ళు తోళ్లు,
-వస్త్ర, అన్న, బిక్ష పైసా కూడా ఇవ్వలేని మూడు లు, కటినాత్ములు ,
-దేశభక్తి, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తిని పొందగలరా దేవుడా !!
-నోట్లో పంచదార పోసుకుని, ఉప్పు తినే రీతిలో ప్రవృత్తి వద్దు,
-మతిలో మమత, అనురాగాలకు,నవ్వుకు నిలయం, వలయం చెయ్యి,
-నీ జననం, ఖననం శవ దహనం లో లోని వివేకం, జీవనగమనంలో మాత్రం ఎందుకు..??
-ఒక కాకి మరణిస్తే,వెయ్యి కాకులు సంతాపం, ఒక కోతి చనిపోతే వందల కోతులు జాతిలో నీతిని ప్రదర్శిస్తాయి..
-మానవ సమూహంలో ఆ.. నలుగురు.. దొరకడం కొరకరాని కొయ్య గా మారింది,
-కులం గుర్తింపుకు,బలం భౌతిక శ్రమకు,నోరు సుభాషితాలుకు మూలం
-మతాన్ని జ్ఞానానికి పాటించే సందేశాలు ఇవ్వు.
-మతోన్మాదం మనిషికి పట్టిన కొవ్వు,
-ఆచార, సంస్కృతి, సాంప్రదాయాలుకు పుట్టినిల్లు, అయినా మనం పెద్ద ఖండంలో మెట్టినిల్లు, హరివిల్లు.
-స్వేచ్ఛ నీ ఇచ్చ అయినా, రచ్చకు పుట్టుమచ్చ..
-ద్వి వాహన,నడక, నడత సరి లేకుంటే అది ఆరని మచ్చగా స్వర్గానికి నిచ్చెన,
-ధనిక,పేద, బేధాలు ఎందుకు ?? తుఫానుకు చెట్లు కూలతాయి మొక్కలు విరిగి పోవు,
-హక్కులు,బాధ్యతల పట్ల సమానీకృతం, తక్కెటలో ఇక్కట్లు లేని సరితూకం ఆవశ్యకం,
-పాలు నుండి మీగడ,వెన్న,పెరుగు నెయ్యిని పొందుతాం,
-ధర్మాత్ములు,మహాత్ములుగా,మానవతావాదులుగా పరిణమించు..
-ఉపకారం,అందరి కోసం ఒకరు, ఒక్కరి కోసం అందరూ,అన్యోన్య సహాయం, మానవత్వం తో చేయడం వ్యవస్థకు ఉపేక్షితం..
-మానవతకు శ్రీకారం, మూడత్వానికీ వికారం కోసం ఎదురుచూపులు..

-చందు ఆంజనేయులు..
విశ్రాంత ప్రాచార్యులు,
సామాజిక విశ్లేషకులు,

## కన్నులు గల కాయ ఓ ముంజకాయ !



అందనంత ఎత్తులో వుంటావు !
ఎండాకాలంలో కాస్తావు ..
నీ కనుల నిండా తియ్యని నీరుని నింపుకొని
మిళమిళ మెరుస్తావు ..
చూడముచ్చటగా వుంటావు !
చూడగానే నోరూరిస్తావు ...
నిన్ను తింటుంటే వుంటుంది ఎంతో కమ్మదనం
ఎంతో చల్లదనం ....

వంగ.శ్రావణ్ కుమార్
మల్లారం
మం.వేములవాడ



## నేటి మనిషి.



విలాసాలని అవసరాలుగ భావించుతు నేటి మనిషి.
ఆదాయము, ఖర్చు మధ్య పొంతన లేక నేటి మనిషి.
ఊరుకు పరుగు జీవితాన శాంతి లేక విచారించె.
అస్తమానం చింతల తోడ కునారిల్లు నేటి మనిషి.

పైన మెరుగులు తన లోపము శాపముగను వింత మనిషి.
పై నవ్వులు, లోన బాధలు కునారిల్లు వింతమనిషి.
బంధాలను విడిచిపెట్టి నిరంతరము బాధపడుతు,
ఒంటరిగా మిగిలినాడు, ధనముతోడ వింత మనిషి.

శాంతి లేక ,రూక కొరకు పరుగులెట్టి నేటి మనిషి,
వయసు దాటి వట్టిపోయి, శాంతి కొరకు నేటి మనిషి.
డబ్బు జబ్బు చేసినాక, గబ్బు బట్టి పోయినాది.
మనసుకింత శాంతి లేక మదనపడుతు నేటి మనిషి.

చూసినంత మోజుపడుతు దెబ్బతినెను నేటి మనిషి.
ఆదాయము మూరెడంత, చూసుకోని నేటి మనిషి.
ఖర్చు జూడ బారెడంత లెక్క లేని వింత మనిషి.
పీక లోతు అప్పు పెరిగి, జారిపడెను, నేటి మనిషి.

ఊరడించు తోడు లేక అలమటించె వింత మనిషి.
మంచి మాట పెడచెవిలో పెట్టినాడు, వింత మనిషి.
తనకు ఎదురు లేదని చెప్పి తప్పుదారి పట్టినాడు,
దారి తెన్ను లేకపోయె, బాధపడుతు వింతమనిషి.

శాంతినిచ్చు మాట కొరకు ఎదురుచూసి నేటి మనిషి.
ఆలసించి గురువు చెంత చేరినాడు, వింత మనిషి.
సత్య మెరిగి గురువుగారు, తత్వ బోధ చేసినాడు.
మంచి బాట పట్టినాడు, గురువు మాట విన్న మనిషి

కవి :ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

## యోగతో ఆరోగ్యం ఆనందం



నిత్య యోగ నవయవ్వన ప్రదాత
యోగతో బలం శారీరక మానసిక
సంతులనం సంతోషం వర్ధిల్లుతుంది

యోగ నిరాశ నిస్పృహలు
తుంచి ఆందోళన ఒత్తిడి తగ్గించి
ఆరోగ్యాన్ని ఆనందాన్ని పెంచి

నైపుణ్యాభివృద్ధితో
ఉత్పాదక శక్తి సామర్థ్యాలు
ఇనుమడిస్థాయి జీవన
ప్రమాణాలు పెరుగుతాయి

యోగతో జీవితంలో
ఆనందం అంతర్గ శాంతి
ప్రశాంతత ప్రగతి
పురోగతి సిద్ధిస్తుంది

నిత్య యోగ శ్వాస ధ్యానం
ఆరోగ్య సంపదకు నిలయం

శ్వాస మీద ధ్యాస
ఆత్మనిర్భరతకు బాట

శ్వాస మనసు ఆత్మ
సమన్వయ వారధి యోగ

యోగతో ఉల్లాసం
ఉత్సాహం మనోల్లాసం

అత్మశ్వాసం ధైర్యం
సాహసం సహనం

యోగతో రోగాలు దూరం
రక్తపోటు వెన్నునొప్పి

ఆర్థరైటిస్ అధిక బరువు తగ్గేను
సామూహిక యోగ తో
ఒంటరి తనం మాయమై సమిష్టి
జీవన విధానం పరిమళిస్తుంది

యోగాతో మానవత్వాన్ని జోడించి
యోగ పరివ్యాప్తి ప్రక్రియలో
ప్రజా భాగమ్యాన్ని పెంచాలన్న
ప్రధాని నరేంద్ర మోడీ
అభినందనీయులు
"వసుదైక కుటుంబం" అనే
ఇతివృత్తంతో జరిగే
అంతర్జాతీయ యోగ
దినోత్సవం ఆరోగ్య భారత్
అవతరణకు ఆలంభణ కావాలి

రండి లేవండి మేల్కొండి
గమ్యం చేరే వరకు విశ్రమించకండి
అన్న వివేకానందుని పిలుపు
స్ఫూర్తిగా తీసుకుని
భారతీయ ఆరోగ్య ఆనంద
జీవ కళ యోగాను విశ్వ వ్యాప్తం
చేసేందుకు ఉద్యమిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్
9440245771

## ప్రశ్నే...ప్రపంచ నిర్మాత!



అనేక అనుమానాలు,
ఆలోచనలు, సందేహాలు...
అంతరంగంలోని గదులలో
సుడులు తిరుగుతూ
మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి!

ఒక చిన్న ప్రశ్న అనేది....
మనసులో అగ్నిపర్వతంలా పెల్లుబికితే
జ్ఞానప్రయాణం మొదలయినట్లే!
అన్యాయానికి ఆనకట్ట పడినట్లే!
సరికొత్త శాస్త్రాలకు ఆవిష్కరణ జరిగినట్లే!

ప్రశ్నించడం మొదలు పెడితే....
సత్యానికి వాకిలి తెరుచుకుంటుంది
చీకటి గదుల్లో వెలుగుకు చోటు దొరుకుతుంది!
ప్రశ్న అనేది ఉన్న చోటనే
ప్రగతికి మార్గం ఏర్పడుతుంది!

కాబట్టి నిశ్శబ్దంగా ఉండకండి
ప్రశ్నించండి...! తెలుసుకోండి..!
ఎందుకంటే ప్రతి ప్రశ్న లోపలే
ఒక కొత్త ప్రపంచం ప్రభవించడానికి
వీలైన విత్తనం దాగుంది మరి!!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



## నీ చేతుల్లో



నీవే ఒక అద్భుతం
నీ సృష్టి ఒక మహా అద్భుతం
నీవు చేసిన లీలలు
ఈ మనుషుల కష్టాలు
పేదవాడు తిండే దొరకక
ఎన్నెన్నో బాధలు పడుతుంటే
ఉన్నవాడు తిన్నది అరగక
తీసే పరుగులు ఎన్నెన్నో?
ఏంటి? స్వామి మీ లీలలు
ఉన్నవాడికి వద్దాన్నా
ఆస్థులన్నీ కూడబెడతావు
లేనివాడికి మాత్రం
వేడుకున్నా ఏమీ ఇవ్వవు
ఇదేనా నువ్వు చేసే న్యాయమని
ఊరికే కూర్చోలేం!
కొన్ని సందర్భాల్లో మాత్రం
దేవుని దైవ బలం కన్నా
మనిషి యొక్క సంకల్పం
గొప్పదని నిరూపిస్తాం!
మనిషి జీవితం అనేది
ఒక అచ్చు వేయని పుస్తకం
అందులో రోజులే పేజీలు
అందంగా ఉండడం
ఐశ్వర్యంలో పుట్టడం
నీ చేతుల్లో ఉండదు కదా!
సమాజహితం కోరడం
మంచిని చేయడం
గొప్పగా బ్రతకడం
వ్యక్తిత్వంతో జీవించడం
నీ చేతుల్లోనే ఉంటుంది.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

## మాకందములు (వెన్నెల జల్లులు)



అతి మధుర మైనట్టి మామిడి ఫలములు,

ఆనందమును అధికముగా వేసవిన యిచ్చిన చూతములు,

ఆరోగ్యమును కలిగించి నోరూరించెడి తియ్యని మాకందములు,

మామిడిపండ్లు తినుటలో పంచును జనులకు సహకారము,

మధురసమును పంచెడి పండు గాదే సహకారము!!

(సహకారము = సాయము,మామిడి )

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

## కవిత



పేరు లోనే కవిత్వం
పేదల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి
కవిత్వం సాహిత్యం
అట్టడుగు వర్గాల
బాధలకు దర్పణం
అన్యాయాలను అక్రమాలను అరికట్టి
పేదల పక్షాన నిలబడే గుండె ధైర్యం
నీళ్ళు నియామకాలు నిధుల కోసం సాధించుకున్న తెలంగాణ
సమస్యల సుడిగుండం
నిరుద్యోగ పెనుభూతం
ఉద్యమాల తెలంగాణ లో
నిలబడి కలబడి కొట్లాడుడే
పోరాటాల పౌరుషం
ఉద్యమాల వీరత్వం
మహిళల ధీరత్వం
యువకుల నిరాష నిస్పృహ
రేపటి బంగారు తెలంగాణ కోసం
తెగించి కొట్లాడుడే
ఇచ్చిన మాట
తప్పిన వారికి
ఓటే ఆయుధం గా
ఓడించుడే
రిగ్గింగ్ కుల మత వర్గ వర్ణ భాష ప్రాంత తేడా లేని సమసమాజ తెలంగాణ
సాధించడం సాధ్యమే
బంగారు తెలంగాణ
సస్యశ్యామల అవినీతి బంధుప్రీతి
లేని అందరికీ అవకాశాలు లభించే
తెలంగాణ సాధిద్దాం !

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్.,
సైదాబాద్, హైదరాబాద్,

## మనసు మారకుంటే

ఫోన్ కాల్ సరిగా వినిపించకపోతే
కట్ చేసి మళ్లీ కాల్ చేస్తాం
సిగ్నల్ సెట్ అయిందో లేదో చూసుకుంటాం

కానీ మనసు సరిగా వినిపించకపోతే
ఎప్పుడైనా కట్ చేసి
మళ్లీ మనసుతో మాట్లాడామా?

స్కూల్ పిల్లాడు ఏడిస్తే
తొడపాశం పెట్టి నిశ్శబ్దం చేస్తాం
ఆ కన్నీళ్లకు కారణం ఏమిటో
ఒక్కసారి అయినా అడిగామా?

రిమోట్ పని చేయకపోతే
రెండు దెబ్బలు వేస్తే
తక్షణమే స్పందిస్తుంది

మనిషి స్పందించకపోతే మాత్రం
దెబ్బలతో కాదు
మనసుతో తట్టాలనేది మర్చిపోయాం

తలచిన పని జరగకపోతే
పిల్లి ఎదురొచ్చిందని , తుమ్మారనే కారణాలు వెతుక్కుంటాం
అసలు కారణం మన చేతుల్లోనే ఉందని
ఒక్క క్షణం ఆలోచించామా?

ఇంట్లో జగడాలకు కారణం
వాకిట్లో చెప్పులు బోర్లాపడటం అంటాం
అసలు చెప్పుల్లా బయటపడిన
మన మాటల ముల్లులు కనిపించవా?

పిల్లల పెండ్లి కుదరకపోతే
పెద్దల ప్రతిష్టలపై నెపం వేస్తాం
మనిషిగా పుట్టినందుకు
తాను సాధించిన కీర్తిప్రతిష్ట
తనవల్ల పెరిగిన ఇంటి ప్రతిష్ట
ఎవరైనా గ్రహించారా?

మెంటి కన్నుతో ఉన్నవారిని
అదృష్టవంతులు అంటాం
కాని మన కళ్లలో ఉన్న
సంకుచిత భావాల్ని మాత్రం
ఎప్పుడూ గుర్తించం

ప్రతి చిన్న సమస్యకు
సులభమైన పరిష్కారం వెతుక్కుంటూ
మన పెద్ద సమస్యలను
అవివేకంతో కప్పిపుచ్చుకుంటున్నాం

ఫోన్‌కి రీస్టార్ట్ ఉంది



రిమోట్‌కి బ్యాటరీ ఉంది
మనిషికి మాత్రం...
మార్పు అనే బటన్ మనసులోనే ఉంది

అది నొక్కే ధైర్యం
మనలో ఎప్పుడు వస్తుంది?

రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్ (మంథని)




# సతీ లీలావతిగా వస్తున్న లావణ్య త్రిపాఠి




టాలీవుడ్ ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి మళ్లీ సినిమాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. చాలాకాలం తర్వాత ఆమె నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం, అనంతరం ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత విడుదల అవుతున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ చిత్రంపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి)' వంటి యూత్‌ఫుల్ చిత్రాలతో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి ఒక రొమాంటిక్ రిలేషన్‌షిప్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. లావణ్య త్రిపాఠి సరసన దేవ్ మోహన్ హీరోగా నటించగా, వీరిద్దరూ భార్యాభర్తలుగా కనిపించనున్నారు. ఈ సినిమా కుటుంబ బంధాలు, దాంపత్య జీవితం, వాటిలో వచ్చే సంఘర్షణలను వినోదాత్మకంగా చూపించనుందని నిర్మాత నాగమోహన్ తెలిపారు. హాస్యం, భావోద్వేగాలు కలగలిసిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'యూ' సర్టిఫికేట్‌ను పొందింది. మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు నరేష్ వీకే, కమేడియన్ సప్తగిరి, తమిళ హాస్యనటుడు వీటీవీ గణెళిష్, రాజేంద్రన్, జాఫర్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని మిక్కీ జే. మేయర్ అందించగా, సినిమాటోగ్రఫీని బినేంద్ర మీనన్ నిర్వహించారు. ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య తీసుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభించగా, త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసి ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. మొత్తానికి, 'సతీ లీలావతి'తో లావణ్య త్రిపాఠి సక్సెస్‌ఫుల్ రీఎంట్రీ ఇస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.


# మెక్సికోలో వారణాసి సందడి

## భారతీయ పురాణగాథలకు యాక్షన్ మేళవింపు

## రాజమౌళి వీడియో వైరల్









భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బ్జడెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను , ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దాదాపు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న 'వారణాసి' మూవీ ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ప్రాజెక్ట్‌గా నిలిచింది. ఈ సినిమా గురించి వచ్చే చిన్న వార్త అయినా సోషల్ మీడియాను ఊపేస్తోంది. నిర్మాతలలో ఒకరైన ఎస్.ఎస్. కార్తికేయ ఈ ఈవెంట్‌కు హాజరై, అక్కడ వారణాసికి సంబంధించిన ఒక స్పెషల్ 'ప్రీ గ్లింప్స్'ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజమౌళి పంపిన వీడియో మెసేజ్ ఇప్పుడు గ్లోబల్ వైడ్‌గా వైరల్ అవుతోంది.

# సల్మాన్ మూవీకి స్పిరిట్ పోటీ కానుందా?



బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ కు ప్రస్తుతం కాలం కలిసిరావడం లేదు. ఒకప్పుడు బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సల్మాన్‌ఖాన్, 2016లో వచ్చిన 'సుల్తాన్' సినిమా తర్వాత మళ్ళీ ఆ స్థాయి బ్లాక్ బస్టర్‌ను చూడలేదు. భారీ అంచనాల మధ్య వచ్చిన 'టైగర్ 3, సికిందర్' సినిమాలు కూడా ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఈ ఏడాది రిలీజ్ కావాల్సిన 'మాతృభూమి' సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. దీంతో సల్మాన్ మార్కెట్ పడిపోతుందా? అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇలాంటి తరుణంలో టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు రంగంలోకి దిగారు. ఎంతో కాలంగా బాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకున్న దిల్ రాజు ఈ సారి దర్శకుడు వంశీ పైడిపల్లిని రంగంలోకి దించి ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, షూటింగ్ కూడా శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సినిమాతోనైనా సల్మాన్ బాక్సాఫీస్ వద్ద తన పూర్వ వైభవాన్ని పొందుతారని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది..! సల్మాన్ ఖాన్‌కు ఈద్ అంటే చాలా సెంటిమెంట్. ప్రతి ఏటా తన సినిమాను ఆ పండుగకే రిలీజ్ చేస్తారు. రాబోయే ఏడాది కూడా మార్చి 9 లేదా 10 తేదీల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. చాలా మందికి తెలిసిన విషయం ఏంటంటే.. అంతకంటే ముందే, అంటే మార్చి 5న పాన్ ఇండియా వైడ్ ఒక భారీ తుపాను రాబోతోంది. అదే.. సందీప్ రెడ్డి వంగా, రెబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' దయానిమల్' తర్వాత సందీప్ వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటు, ఇప్పటికే విడుదలైన ఆడియో టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ 'స్పిరిట్'పై అంచనాలను భారీగా పెంచేశాయి. వచ్చే ఏడాది అందరికన్నా ముందే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయడంతో మిగతా హీరోలు తమ సినిమాలను వాయిదా వేసుకుంటారు. కానీ, సల్మాన్ ఖాన్ మాత్రం పక్కాగా అదే వారంలో బరిలోకి దిగుతున్నారు. 'స్పిరిట్' రిలీజ్ అయిన కేవలం 5 రోజుల గ్యాప్‌లోనే సల్మాన్ సినిమా రావడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఈ 5 రోజుల గ్యాప్ అనేది రెండు సినిమాలపై ప్రభావం చూపుతుంది. 'స్పిరిట్'కు టాక్ పాజిటివ్‌గా వస్తే, ఆ ప్రభంజనాన్ని తట్టుకోవడం సల్మాన్ సినిమాకు చాలా కష్టం. ఒకవేళ 'స్పిరిట్' ఏ కారణం చేతనైనా వాయిదా పడితే మాత్రం సల్మాన్ ఖాన్‌కు అది పెద్ద అడ్వాంటేజ్ అవుతుంది.



# మాయన్ నాగరికత అంటే ఇష్టం




బాహుబలిలో అదే అనుసరించా

వారణాసి కోసం మహేశ్ బాబు కష్టపడుతున్నారు

మాయన్ నాగరికత.. వారి కట్టడాలు.. ఎప్పుడూ నన్ను విస్మయానికి గురిచేస్తూనే ఉంటాయి. 'బాహుబలి' సినిమాలో చూసిన మాహిష్మతి నగరం, అందులోని సిటీ సెంటర్ ఆ అద్భుతమైన సింహాసనం.. వీటన్నిటికీ మెక్సికోలోని ప్రసిద్ధ చిచెన్ ఇట్జా పిరమిడ్లే ఇన్‌స్పిరేషన్‌గా నిలిచాయని, రాజమౌళి తన గత చిత్రాల్లోనే ఈ మెక్సికన్ ఆర్కిటెక్చర్ నుంచి స్ఫూర్తి పొందానని ఈ వీడియోలో తొలిసారి బయటపెట్టారు. ఇక ఇండియన్ మైథాలజీని, గ్లోబల్ స్టాండర్డ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో కలిపి ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించిన వారణాసి ప్రీ గ్లింప్స్‌కు అక్కడి ఆడియెన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా మేకింగ్ హాలీవుడ్ రేంజ్‌లో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక మరోవైపు 'వారణాసి' కోసం మహేష్ బాబు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ప్రస్తుతం హైదరాబాద్ షెడ్యూల్ ముగియడంతో షూటింగ్‌కు చిన్న గ్యాప్ దొరికింది. కానీ రాజమౌళి మాత్రం మహేష్ బాబుకు విశ్రాంతి ఇవ్వకుండా నేరుగా ఆయనను విదేశాలకు పంపించారు. త్వరలోనే 'వారణాసి' తదుపరి షెడ్యూల్ అంటార్కిటికాలోని కఠినమైన మంచు గడ్డల మధ్య జరుగుతుండడంతో అక్కడి మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలకు మహేష్ బాబు శరీరం అలవాటు పడేలా, ప్రస్తుతం ఆయనకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారట. ఎక్కడా టైమ్ వేస్ట్ కాకూడదని జక్కన్న పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. మంచు కొండల్లో చేసే సాహసోపేతమైన పోరాట సన్నివేశాల కోసం మహేష్ ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీపై కూడా వర్క్ చేస్తున్నారు. అడ్వెంచర్ అంటే ఇలా ఉండాలని రాజమౌళి చూపిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో నటిస్తున్నారు. విలక్షణ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నారు. ఆగస్ట్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి పెట్టాలని టీమ్ లక్ష్యంగా పెట్టుకుంది. 2027 ఏప్రిల్ 7న సమ్మర్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న వారణాసి భారతీయ సినిమా సత్తాను గ్లోబల్ మార్కెట్‌లో మరోసారి చాటడం ఖాయంగా కనిపిస్తోంది. జక్కన్న మార్క్ గ్రాఫిక్స్, కీరవాణి సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లడం గ్యారెంటీ. నేను 25 ఏళ్ల నుంచి సినిమాలు చేస్తున్నా. మనం ఎంతో కష్టపడి తెరకెక్కించిన చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. మీరంతా 'ఆర్ఆర్ఆర్'ను ఆదరించినప్పుడు నా సంతోషానికి అవధులు లేవు. 'నాటు నాటు' పాటకు ప్రపంచమంతా కాలు కదిపింది. ఆ మూమెంట్స్ చూసినప్పుడు భావోద్వేగానికి గురయ్యాను. నేను సినిమాలు ఎందుకు తీస్తున్నానో అప్పుడే అర్థమైంది' అని రాజమౌళి తెలిపారు.

# టాక్సిక్‌లో యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

## దర్శకురాలు గీతూమోహన్ ప్రతిభ అద్భుతం అన్న యశ్




యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఈ సినిమా టీజర్ విడుదలైన నాటి నుంచి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'టాక్సిక్'లోని సన్నివేశాల గురించి యశ్ ఇటీవల సినిమాకాన్ వేడుకలో మాట్లాడారు. ఈ యాక్షన్ చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు తెరకెక్కిస్తు న్నందువల్ల సరికొత్తగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌పై ప్రశంసలు కురిపించారు. 'సాధారణంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాలు అంటే పురుష దర్శకులే బాగా చేస్తారనే భావన చాలామందిలో ఉంటుంది. కానీ, ఈ గ్యాంగ్‌స్టర్ కథను ఒక మహిళా కోణంలో చూపించడం అనేది చాలా కొత్తగా ఉంటుంది. ఇందులోని శృంగార సన్నివేశాల నుంచి యాక్షన్ సీన్స్ వరకు ప్రతి దానిలోనూ ఆమె ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. సున్నితమైన భావాలను ఎంత హృద్యంగా చూపించారో.. యాక్షన్ సన్నివేశాలను కూడా అదే స్థాయిలో తెరకెక్కించారు. అన్నిరకాల భావోద్వేగాలను లేడీ డైరెక్టర్ ఇంత బాగా ప్రజెంట్ చేయగలరా అని ఆమెతో ప్రయాణించాకే నాకు అర్థమైంది. ఇందులోని సన్నివేశాలు గతంలో చూడనివిధంగా విభిన్నంగా ఉంటాయి. గీతూ గొప్ప రచయిత కూడా.. ఆమె నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని యశ్ అన్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యశ్ సరసన ఐదుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు. కొన్ని కారణాల వల్ల జూన్ 4కు వాయిదా పడింది.

# చట్టం స్పోర్ట్స్

# ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చిన సన్ రైజర్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సగం దశను పూర్తి చేసుకుంది. రెండో దశ మ్యాచ్‌లు ఆరంభం కానున్నాయి. దాంతో లీగ్ మరింత రసవత్తరంగా మారనుంది. వారం వారం గడిచే కొద్ది ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారడం ఖాయం. ప్రస్తుతానికి ప్లే ఆఫ్స్ రేసు అయితే ఆసక్తికరంగా మారింది. పంజాబ్ కింగ్స్ ఆడిన 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. ఒక రద్దుతో 11 పాయింట్లతో లీగ్ టేబుల్లో టాప్ ప్లేస్‌లో ఉంది. ఇక రాజస్థాన్ రాయల్స్ 7 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. రెండు ఓటములతో 10 పాయింట్లతో రెండో స్థానంలో.. ఆర్సీబీ 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. రెండు ఓటములతో 8 పాయింట్లతో మూడో స్థానంలో.. సన్ రైజర్స్ హైదరాబాద్ 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 ఓటములతో 8 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. అయితే ఈ నాలుగు జట్లే ప్లే ఆఫ్స్‌కు చేరతాయనే గ్యారెంటీ లేదు. ప్రస్తుతానికి 10 జట్లకు కూడా ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉన్నాయి. అయితే కేకేఆర్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లు ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కనీసం 6 గెలవాలి. ప్రస్తుతానికి ఈ మూడు జట్లు ప్లే ఆఫ్స్ చేరడం చాలా కష్టం. ఇక పంజాబ్ కింగ్స్ మిగిలి ఉన్న 8 మ్యాచ్‌ల్లో 3 మ్యాచ్‌ల్లో గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే ప్లే ఆఫ్స్ ఊరిస్తోంది. ఆరంభంలో ఓటములతో సీజన్‌ను ఆరంభించినా.. హ్యాట్రిక్ విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. సన్ రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుతానికి 7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు.. 3 పరాజయాలతో 8 పాయింట్లతో లీగ్ టేబుల్లో 4వ స్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌లతో ప్లే ఆఫ్స్‌కు గట్టి పోటీ ఉంది. పంజాబ్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, ఆర్సీబీ జట్లు టాప్3లో వెళ్లినా.. నాలుగో స్థానం కోసం సన్ రైజర్స్, చెన్నై, గుజరాత్, ఢిల్లీ జట్ల మధ్య గట్టి పోటీ అయితే ఉంది. ఇతర జట్లపై ఆధారపడకుండా నేరుగా ప్లే ఆఫ్స్ చేరాలంటే సన్ రైజర్స్ హైదరాబాద్ కనీసం 16 పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. అంటే మరో 8 పాయింట్లు కావాలి. అంటే నాలుగు విజయాలు. మిగిలి ఉన్న 7 మ్యాచ్‌ల్లో కనీసం 4 మ్యాచ్‌ల్లో నెగ్గితేనే ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది. 5 లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో గెలిస్తే టాప్ 2లో నిలుస్తుంది. అలా కాకుండా 7 మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గితే మాత్రం అప్పుడు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్ చేరాలంటే టాప్ 2లో



నిలిచిన జట్లు డామినేషన్ చూపించాలి. అదే సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ నెట్ రన్ రేట్ కూడా బాగుండాలి. కానీ, ఇది చాలా కష్టం. సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ చేరాలంటే 4 మ్యాచ్‌ల్లో తప్పక గెలవాలి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ తన తదుపరి మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్ (ఏప్రిల్ 26న), ముంబై ఇండియన్స్ (ఏప్రిల్ 29న), కేకేఆర్ (మే 3న), పంజాబ్ కింగ్స్ (మే 6న), గుజరాత్ టైటాన్స్ (మే 12న), చెన్నై సూపర్ కింగ్స్ (మే 18న), ఆర్సీబీ (మే 22న) ఆడనుంది. కేకేఆర్, పంజాబ్ కింగ్స్, ఆర్సీబీలతో జరిగే మ్యాచ్‌లను ఉప్పల్ వేదికగా ఆడనుంది.

## కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి..



సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌తో కీలక పోరుకు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం నిజంగా గుడ్ న్యూసే. రేపు(ఏప్రిల్ 25) రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్ లో తాను బరిలోకి దిగుతున్నానని స్వయంగా ప్యాట్ కమిన్స్ ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు కమిన్ ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు. కమిన్స్ తన ఇన్ స్టాలో పూర్తిస్థాయిలో బౌలింగ్ చేస్తూ కనిపించిన చిత్రాలను పంచుకుంటూ, "చాలా కాలం తర్వాత వస్తున్నాను, రేపు మళ్లీ మైదానంలోకి దిగడానికి ఆతృతగా ఉన్నాను," అని రాశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా 'వస్తున్నాడు' అంటూ ఎక్స్ వేదికగా కమిన్స్ ఫోటోను షేర్ చేసింది. ఈ సీజన్‌లో తొలి ఏడు మ్యాచ్‌లకు దూరమయ్యాక అతని ఈ ఉత్సాహం స్పష్టమైంది. అతని జట్టు సహచరుడు ట్రావిస్ హెడ్ "ఈ ఏఐ చిత్రాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించాడు. కమిన్స్ లేకపోవడంతో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్‌కు ఐపీఎల్ కెప్టెన్‌గా నాయకత్వం వహించాడు. కాగా, గతేడాది జులై నుంచి వెన్ను గాయంతో బాధపడుతున్న ఈ ఆస్ట్రేలియా ఆటగాడు టీ20 ప్రపంచ కప్‌కు దూరమయ్యాడు. ఆ తర్వాత డిసెంబర్‌లో ఒకే యాషెస్ టెస్టులో మాత్రమే కనిపించాడు. ప్యాట్ కమిన్స్ పేస్ బౌలింగ్, నాయకత్వ సామర్థ్యాలకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా, ఈ సుదీర్ఘ విరామం జాతీయ జట్టుకూ, ఫ్రాంచైజీకి ఆందోళన కలిగించింది. మార్చి 27న జట్టుతో చేరినప్పటికీ.. ఏప్రిల్ 4న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ తర్వాత చివరి వైద్య పరీక్షల కోసం స్వదేశం వెళ్ళాడు. ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షను పూర్తి చేసుకుని, ఇప్పుడు సన్‌రైజర్స్ తరపున తిరిగి రంగప్రవేశం చేస్తున్నాడు. సన్‌రైజర్స్ ప్రారంభంలో మొదటి 4 మ్యాచ్‌లలో మూడు ఓడిపోయి.. అనంతరం వరుసగా 3 విజయాలతో పుంజుకున్నారు. అంటే 7 మ్యాచ్ లలో 4 గెలిచి 8 పాయింట్లు, ం0.820 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లోకి దూసుకెళ్లారు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సాధించిన 47 పరుగుల తేడాతో విజయం తర్వాత సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లోకి వస్తోంది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో అభిషేక్ శర్మ అజేయంగా 135 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయ ఉత్సాహంలో వారు రియాన్ పరాగ్ నాయకత్వంలోని రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కోనున్నారు.

## ముంబై ఇండియన్స్ ఓటమికి 3 ప్రధాన కారణాలు..

ఐపీఎల్ 2026లో లీగ్ స్టేజీ 33వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 103 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్ ను ఓడించింది. ముంబైలోని వాంఖెడేలో జరిగిన మ్యాచులో మొదట బ్యాటింగ్‌కు దిగిన సీఎస్కే 207 పరుగులు చేసింది. ఈ వేదికలో ఈ టార్గెట్ ఛేదించడం అంత కష్టమేమీ కాకపోయినప్పటికీ, ముంబై ఇండియన్స్ కేవలం 104 పరుగులకే ఆలౌట్ అయింది. ఐపీఎల్ చరిత్రలో పరుగుల పరంగా ముంబైకి ఇది అతిపెద్ద ఓటమి కాగా, మరోవైపు చెన్నైకి అతిపెద్ద విజయం కావడం విశేషం. జస్‌ప్రీత్ బుమ్రా తొలి పవర్ ప్లేలో వికెట్లు తీయలేకపోయాడు. ఆ తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్‌కు వచ్చినప్పటికీ భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. హార్దిక్ పాండ్యా తన 2 ఓవర్లలో 38 పరుగులు ఇచ్చాడు. గత మ్యాచులలో సైతం హార్దిక్ అన్ని విభాగాల్లో నిరాశపరుస్తున్నాడు. వాంఖడే పిచ్ బ్యాటర్లకు అనుకూలం. దీనిని సంజు శాంసన్ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అద్భుత సెంచరీ బాదాడు. సంజూ శాంసన్‌ను అవుట్ చేయడానికి ముంబై బౌలర్ల వద్ద ఎటువంటి వ్యూహం కనిపించలేదు. స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ప్రభావం చూపలేకపోయాడు. శాంట్నర్ 4 ఓవర్లలో 11 ఎకానమీతో 44 పరుగులు ఇచ్చాడు. ముంబై ఇండియన్స్ ఘోర పరాజయానికి హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ వైఫల్యం కూడా ఒక కారణం. ప్రధాన బౌలర్ల కంటే ముందే తనకు తాను ప్రాధాన్యత ఇచ్చుకోవడం ముంబై కొంపముంచింది. గత మ్యాచ్‌లలో కూడా అతడి బౌలింగ్ వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదు. తాను ఒక బ్యాటింగ్ ఆల్ రౌండర్ అని, తన ప్రాధాన్యత బ్యాటింగ్ మీద ఉండాలని హార్దిక్ అర్థం



చేసుకోలేకపోతున్నాడు. పాండ్యా బౌలింగ్‌లో 38 పరుగులు ఇవ్వగా, బ్యాటింగ్‌లో కేవలం 1 పరుగు మాత్రమే చేశాడు. ముంబై జట్టులో ఇద్దరు ప్రధాన బ్యాటర్లు డకౌట్ కావడం దెబ్బతీసింది. వాంఖడేలో రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం చూపింది. అటువంటి పరిస్థితుల్లో 208 పరుగుల లక్ష్యం ముంబైకి పెద్ద విషయం కాదు. కానీ ముంబై జట్టు 104 పరుగులకే ఆలౌట్ అయింది. డానిష్ మలేవర్ తన ఓవర్ తొలి బంతికే అకీల్ హొస్సేన్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. తర్వాతి ఓవర్లో క్వింటన్ డికాక్ ముఖేష్ చౌదరి బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తల్లి చనిపోయినా ఆట పట్ల నిబద్ధతను చాటుతూ ముఖేష్ చౌదరి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. 11 పరుగుల వద్ద ముంబైకి మరో దెబ్బ తగిలింది. మరో బ్యాటర్ నమన్ ధీర్ కూడా అకీల్ హొస్సేన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. 200కు పైగా టార్గెట్ ఛేదించే క్రమంలో మంచి ఆరంభం కావాలి. కానీ ముంబై జట్టులో అలా జరగకపోవడం ఓటమికి ప్రధాన కారణమైంది. సూర్యకుమార్ యాదవ్ (36), తిలక్ వర్మ (37) నాలుగో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరు ఔటయ్యాక ముంబై జట్టు పేకమేడలా కూలిపోయింది. 84 పరుగుల వద్ద నాలుగో వికెట్ పడగా, 104 పరుగుల వద్ద 10వ వికెట్ కోల్పోయింది ముంబై. అంటే కేవలం 20 పరుగుల వ్యవధిలో పటిష్ట ముంబై జట్టు 7 వికెట్లు కోల్పోయింది. హార్దిక్ పాండ్యా (1), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (0), శార్దూల్ ఠాకూర్ (6) విఫలమయ్యారు. సీఎస్కే బౌలర్లు అకీల్ హొస్సేన్ 4 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా, నూర్ అహ్మద్ 2 వికెట్లు సాధించాడు. వాంఖడే చరిత్రలో తొలిసారిగా ఒకే మ్యాచ్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు తీశారు.

.//..........

## చెన్నైకి శాపంగా మారిన రుతురాజ్ గైక్వాడ్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ముంబై ఇండియన్స్‌ను 103 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. జట్టు మొత్తం సమష్టిగా రాణించినా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాత్రం కేవలం 14 బంతుల్లో 22 పరుగులు చేసి వెనుదిరిగాడు. అల్లా గజన్‌ఫర్ బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి అవుట్ కావడంతో, ఒక స్టార్ ఓపెనర్‌గా ఆయన బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గైక్వాడ్ వైఫల్యం జట్టు బ్యాటింగ్ ఆరంభాన్ని బలహీన పరుస్తోంది. ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ గణాంకాలు చూస్తే ఎవరైనా విస్తుపోవాల్సిందే. ఈ ఏడాది ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో ఆయన వరుసగా 6, 28, 7, 15, 7, 19, 22 పరుగులు మాత్రమే చేశారు. అంటే మొత్తం 7 మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 104 పరుగులు మాత్రమే సాధించాడు. ఆయన సగటు కేవలం 14.86గా ఉండటం విశేషం. కనీసం ఐదు ఇన్నింగ్స్‌లు ఆడిన ఓపెనర్లలో అత్యంత తక్కువ సగటు కలిగిన ఆటగాడిగా గైక్వాడ్ అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. ఆయన స్ట్రైక్ రేట్ కూడా 120 లోపే ఉండటం గమనార్హం. ఒకవైపు గైక్వాడ్ ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతుంటే, అదే జట్టులో సంజూ శామ్సన్ పరుగుల విధ్వంసం సృష్టిస్తున్నాడు. శామ్సన్ ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 58.60 సగటుతో ఏకంగా 293 పరుగులు చేశాడు. ఇందులో రెండు మెరుపు శతకాలు కూడా ఉండటం విశేషం. శామ్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో, వచ్చే సీజన్ నాటికి చెన్నై జట్టు నాయకత్వ బాధ్యతలను ఆయనకు అప్పగించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నాడు. 31 ఏళ్ల శామ్సన్ నాయకత్వ లక్షణాలు కూడా గైక్వాడ్ స్థానానికి ఎసరు పెట్టేలా ఉన్నాయి. రుతురాజ్ గైక్వాడ్ గతంలో అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, ప్రస్తుత ఫామ్ ఆయన కెప్టెన్సీని ప్రశ్నార్థకం చేస్తోంది. జట్టు విజయం సాధిస్తున్న తరుణంలో ఆయన వైఫల్యాలు బయటకు కనిపించకపోయినా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓపెనర్ విఫలమైతే జట్టు మూల్యం చెల్లించుకోక తప్పదు. మరి రానున్న మ్యాచ్‌ల్లోనైనా ఈ 'సూపర్ స్టార్' ఫామ్ పుంజుకుంటారో లేక చెన్నై నాయకత్వ మార్పు దిశగా అడుగులు వేస్తుందో వేచి చూడాలి.



## ఐపీఎల్ లోకి పాకిస్థాన్ మూలాలున్న ప్లేయర్

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కీలక మార్పు జరిగింది. ఇంగ్లాండ్ ఓపెనింగ్ బ్యాటర్ బెన్ డకెట్ ఈ టోర్నీకి దూరమయ్యాడు. దీంతో అతడి రిప్లేస్?మెంట్?ను ఢిల్లీ ఫ్రాంచైజీ తాజాగా అధికారికంగా ప్రకటించింది. డకెట్ స్థానంలో ఇంగ్లిష్ లెగ్- స్పిన్నర్ రెహాన్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తెలిపింది. కాగా, రెహాన్ రూ. 75 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్?తో చేరాడు. గతేడాది దుబాయ్ వేదికగా డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో బెన్ డకెట్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది.



ఐపీఎల్‌లో డకెట్‌కు ఇది మొదటి అవకాశం. కానీ అతను తన అంతర్జాతీయ కెరీర్, టెస్ట్ ఫామ్‌ను మెరుగుపరుచుకోవడానికి ఐపీఎల్‌లో ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. ఈ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు చివరి నిమిషంలో డకెట్ వెల్లడించాడు. దీంతో బీసీసీఐ అతడిపై రెండేళ్ల పాటు ఐపీఎల్ నుంచి నిషేధం విధించింది. 21 ఏళ్ల రెహాన్ అహ్మద్ లెగ్ స్పిన్నర్. అతను ఇంగ్లాండ్ జాతీయ జట్టు తరపున 5 టెస్టులు, 9 వన్డేలు, 13 టీ20 మ్యాచ్?లు ఆడాడు. అతను ఇప్పటివరకు మొత్తం అంతర్జాతీయ కెరీర్?లో 49 వికెట్లు పడగొట్టాడు. అతడు బౌలింగ్?తోపాటు జట్టుకు అవసరమైనప్పుడు బ్యాటింగ్ కూడా చేయగలడు. అయితే రెహాన్ కెరీర్ పరంగా ఇంగ్లాండ్? జాతీయ జట్టుకు ఆడుతున్నప్పటికీ అతడికి మన దాయాది దేశం పాకిస్థాన్‌తో ఒక ప్రత్యేక అనుబంధం ఉంది. పాకిస్థాన్ మూలాలున్న కుటుంబంలో రెహాన్ జన్మించాడు. అతడి తండ్రి నయీమ్ అహ్మద్ పాకిస్థాన్‌లో జన్మించారు. నయీమ్ కూడా యంగ్ ఏజ్?లో ఒక క్రికెటర్. కానీ, జీవితంలో ఎదుగుదల కోసం అతను 2001లో ఇంగ్లాండ్‌కు వలస వెళ్లారు. అక్కడ టాక్సీ డ్రైవర్‌గా పనిచేశారు. ఇక ఆయన పాకిస్థాన్?కే చెందిన ముస్రత్ హుస్సేన్?ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమె కూడా పెళ్లి తర్వాత నాటింగమ్?షైర్?కు షిఫ్ట్ అయ్యారు. ఈ దంపతులు అక్కడే స్థిరపడ్డారు. వీళ్లకు 2004లో రెహాన్ ఇంగ్లాండ్‌లోని నాటింగ్‌హామ్‌లో జన్మించాడు. క్రికెట్?లో తీవ్రమైన పోటీ ఉండే ఇంగ్లాండ్?లో రెహాన్ 18ఏళ్లకే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతడు 2022లో తొలి మ్యాచ్ ఆడాడు. అలాగే ఇంగ్లాండ్ తరపున టెస్టుల్లో అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కులలో రెహాన్ ఒకడు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే 2022లో అతడు పాకిస్థాన్?పైనే అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్?లోనే అదిరే ప్రదర్శనతో సత్తా చాటాడు. పాకిస్థాన్?తో ఆ మ్యాచ్?లో తొలి ఇన్నింగ్స్?లో సౌద్ షకీల్, ఫహీమ్ అష్రఫ్ వికెట్లు పడగొట్టాడు. ఇక రెండో ఇన్నింగ్స్?లో పాకిస్థాన్ పతనం శాసించాడు. తన స్పిన్?తో పాక్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఏకంగా ఐదు వికెట్లతో ఔరా అనిపించాడు. 18ఏళ్ల వయసు, అదీనూ తొలి మ్యాచ్?లోనే డ్రీమ్ డెబ్యూ అనేట్లు ఆడాడు. రెండో ఇన్నింగ్స్?లో బాబార్ అజామ్, సౌద్ షకీల్, రిజ్వాన్, సల్మాన్ అఘా, మహ్మద్ వాసిమ్?లను పెవిలియన్?కు పంపించాడు. అలా తొలి మ్యాచ్?లోనే 7 వికెట్లు పడగొట్టి అప్పట్లో సంచలనం సృష్టించాడు.

## అభిమానులతో సచిన్ బర్త్ డే సెలబ్రేషన్స్



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ శుక్రవారం (ఏప్రిల్ 24) 53వ పుట్టినరోజు జరుపుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఆయన నివాసం వద్దకు పెద్ద ఎత్తున అభిమానులు చేరుకున్నారు. సచిన్?కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానుల సమక్షంలో సచిన్ సచిన్ కేక్ కట్ చేశాడు. ఈ వేడుకలో ఆయన సతీమణి అంజలి కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సచిన్ వీరాభిమాని సుదీర్ కూడా హాజరయ్యారు. మరోవైపు, సోషల్ మీడియాలో సచిన్?కు బర్త్? విషెస్ వెల్లువెత్తాయి. ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రస్తుత, మాజీ క్రికెటర్లు శు భాకాంక్షలు తెలుపుతున్నారు. సచిన్ కుమారుడు అర్జున్ తెందుల్కర్ తన తండ్రికి శుభాకాంక్షలు చెప్పాడు. అయితే ప్రస్తుతం అర్జున్ ఐపీఎల్ ఆడుతున్నాడు. అతడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుతో ఉన్నాడు. దీంతో తండ్రిని స్వయంగా కలువలేకపోయాడు. అందుకే ఆన్‌లైన్‌లోనే తండ్రికి శుభాకాంక్షలు చెప్పాడు. ఈ వీడియోను లఖ్?నవూ సూపర్ జెయింట్స్ తమ ఎక్స్ అకౌంట్?లో షేర్ చేసింది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999